# హస్తం పాలనలో సాగు అస్తవ్యస్తం

• ముందస్తు ప్రణాళికలు రూపొందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం • బీఆర్ఎస్ పాలనే మేలంటున్న రైతన్నలు

తాండూరు, మార్చి 13: యాసంగి సీజన్‌లో వరి, మొక్కజొన్న, పుచ్చకాయ పంటలు చేతికి వచ్చే సమయంలో తాండూరు నియోజకవర్గం రైతులకు సాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. పెద్దేముల్ మండల పరిధిలోని రేగొండి, కొండాపూర్, మారెపల్లి తండాతో పాటు అనేక గ్రామాల్లో సాగునీరు అందక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వేసవికి ముందే బోర్లలో నీళ్లు అడుగంటి పోవడంతో నీరందక పంటలు ఎండిపోతున్నాయి. పెద్దేముల్ మండల పరిధిలోని పలు గ్రామాలకు కోట్‌పల్లి ప్రాజెక్టు నీళ్లు అందక రైతులు అల్లాడిపోతున్నా... పట్టించుకునే వారే కరువయ్యారు. సాగు నీరు అందించడానికి ముందస్తు ప్రణాళికలు రూపొందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం రైతులకు శాపంగా మారింది. కోట్‌పల్లి ప్రాజెక్టు నీరు చెరువుల్లోకి చేరకపోవ డంతో పలుగ్రామాల్లో చెరువులు ఎండిపోయి మైదానాలను తలపిస్తున్నాయి. కాంగ్రెస్ సర్కార్ ఒకవైపు రైతుభరోసా ఇవ్వకపోవడం, మరో వైపు సాగు నీటి ఇబ్బందులను తీర్చకపోవడంపై రైతులు సీఎం రేవంత్‌రెడ్డి పాలనపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ హయాంలో ఒక్కసారి కూడా సాగునీటి ఇబ్బందులు తలెత్తలేదని రైతులు గుర్తు చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో విద్యుత్, ఎరువులు, పెట్టుబడి సాయం సకాలంలో అందించేవారన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ హయాంలో ఎరువులు, పెట్టుబడి సాయం అలా ఉంచితే... పంటలకు నీళ్లు అందించలేని పరిస్థితి దాపురించిందని రైతన్నలు పేర్కొంటున్నారు.

**కొడంగల్ :** కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని బొంరాస్‌పేట మండలం ఏర్పుమళ్ళ గ్రామంలో అరుణ్ అనే రైతు తనకున్న 3ఎకరాల 20గుంటల భూమిలో వరి పంట సాగు చేస్తున్నాడు. పంట చివరి గింజదశలో చేరుకొంది. బోరు బావిలో నీటి శాతం తగ్గిపోవడంతో పంటను కాపాడుకునేందుకు ఈ మధ్య కాలంలో కొత్తగా బోరుబావిని తవ్వించుకున్నాడు. కానీ కొన్నిరోజులకే నీటి నిల్వలు పడిపోయాయి. వేలకు వేలు ఖర్చు పెట్టి వరి పంట పండిచుకొంటే, దీనికి తోడు వేసుకున్న కొత్త బోరులో కూడా నీరింకి మరింత ఖర్చు మిగిలించిదని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఎండల తాకిడికి మార్చి నెల చివరి నాటికి బోరు బావుల పరిస్థితి అగమ్య గోచరంగా మారుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో చెరువులు కుంటల్లో నీటి నిల్వలు పుష్కలంగా ఉండటంతో భూగర్భ జలాలు నిండుకొని బోరు బావుల్లో నీటి కళ ఏర్పడి ఉండేది. సంవత్సరం పొడవునా మూడు పంటలు పండిచుకున్న నీటికి ఎటువంటి లోటు ఉండేది కాదు. కానీ ఈ సారి వేసవి ప్రారంభంలోనే నీటి ఎద్దడిని ఎదుర్కోవాల్సి వస్తుందని రైతన్నలు వాపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి పంట పెట్టుబడి రాక, వేసకున్న పంటలకు అప్పులు ఏర్పడి నానా ఇబ్బందులకు గురౌతున్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పంట పెట్టుబడికి రైతుబంధు వచ్చేదని, దాంతో పంట నష్టంపై అంతగా బాధ పడే పరిస్థితి ఉండేది కాదని తెలుపుతున్నారు. కానీ ఆ కాలంలో పంట నష్టం కాకుండా అశించినంత మేరకు పంటను పండించుకొని గిట్టబాటు ధరతో పంటలను ప్రభుత్వానికి అమ్ముకొని ధీమాగా బతికిన కాలంగా పేర్కొంటున్నారు. రైతున్నలకు కేసీఆర్ అండ ఏంటో ప్రస్తుతం అర్థం అవుతుందని, కేసీఆర్ అందించిన రైతులకు సంక్షేమం అంతా ఇంతా కాదని రైతులు కొనియాడుతున్నారు.



కొడంగల్: సాగునీరు అందక ఎండిపోయిన వరిపంట

### చాలా ఇబ్బందులు పడుతున్నం



నాకు ఉన్న మూడు ఎకరాల్లో రెండు ఎకరాల్లో పుచ్చకాయ, ఒక ఎకరంలో మొక్క జొన్న పంటను సాగు చేశా. ఉన్న బోరు వట్టిపోవడంతో కొత్తగా రెండు బోర్లు వేశాను. అయినా చుక్కనీరు పడలేదు. రూ.1.5 లక్షలు వృథా గా పొయ్యాయి. దీంతో పుచ్చకాయ, మొక్క జొన్న పంటలను ఎలా కాపా డుకోవాలోనని చింతిస్తూ ఇలా దిగులుగా ఉన్న. కాంగ్రెస్ పాలనలో ఇంత కష్టాలు వస్తాయనుకోలేదు. రాష్ట్రంలో రైతుల బాధలు తీరాలంటే ఒక్క కేసీఆర్‌తో మాత్రమే సాధ్యమవుతుందని అర్థమవుతుంది. సీఎం రేవంత్‌రెడ్డి నెరవేర్చని హామీలను ఇస్తూ ప్రజలందరినీ మోసం చేస్తున్నడు. పంట సాగుకోసం గతంలో కేసీఆర్ రైతు బంధు కోసం ఇచ్చిన విధంగా ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు భరోసా పేరుతో ఎకరానికి రూ.6 వేల చొప్పున ఏడాదికి రెండుసార్లు రూ.12 వేలు ఇస్తామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటలేదు. కేసీఆర్ ఇచ్చిన రైతు బంధుతో వ్యవసాయం పం డుగల చేసుకున్నాం. ఇప్పుడు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందక పోవడంతో చాలా ఇబ్బందిగా మారింది. మళ్లీ కేసీఆర్ పాలన వస్తేనే పండుగలా వ్యవసాయం చేసుకుంటాం.

**మెగావత్ గోపాల్ రైతు, మారెపల్లి తండా, తాండూరు**

### ఎండుతున్న పంటను చూసి కన్నీరే..



నాకు ఉన్న మూడు ఎకరాల 20 గంటల భూమిలో మొత్తం సాగు చేశాను. కానీ పంట చేతికి వచ్చే సమయంలో నీరందక ఎండిపోతుంది. పంటను కాపాడుకునేందుకు అప్పుతెచ్చి మరొక బోరుబావిని తవ్వించాను. ఇప్పుడు అది కూడా ఎండిపోవడంతో పంట సాగుకు చేసిన పెట్టుబడి, బోరు తవ్వించేందుకు తెచ్చిన అప్పును ఎలా తీర్చాలో అర్థంకావడం లేదు. ఎండి తున్న పంటను చూసి కన్నీరు పెట్టుకోవాల్సిన పరిస్థితి. ప్రస్తుతం చాలా వరకు వేసుకున్న వరి పంటలు గింజ దశకు పెరుగుతున్నాయి. ఈనెల చివరి వరకు అధికంగా నీటి ఇబ్బందులు ఏర్పడే పరిస్థితి కనిపిస్తున్నది. వేసుకన్న పంటలను ఏవిధంగా కాపాడుకోవాలో తెల్వడం లేదు. ఎండుతున్న పంటలను ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో పరిశీలించి రైతులను ఆదుకునే దిశగా చర్యలు చేపట్టాలి.

**–అరుణ్, రైతు ఏర్పుమళ్ళ గ్రామం. కొడంగల్**

## నర్సరీల్లో మొక్కలను సంరక్షించాలి



కులకచర్ల, మార్చి 13: నర్సరీలలో పెంచుతున్న మొక్కలకు నీటిని అందించి సంరక్షించాలని కులకచర్ల ఎంపీవో భాస్కర్‌గౌడ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని బండవెల్కిచర్ల గ్రామాన్ని ఆయన సందర్శించి గ్రామ పంచాయతీలో పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నర్సరీల్లో పెంచుతున్న మొక్కలలో ఉన్న కలుపు మొక్కలను తొలగించాలని సూచించారు. గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేరుగా చేసి కంపోస్ట్‌షెడ్‌లకు తరలించాలన్నారు. మోరీలలో మురుగునీరు ఉండకుండా చూడాలన్నారు. ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎక్కడైనా వాటర్ లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో బండవెల్కిచర్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

## కులకచర్ల మార్కెట్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం



సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ ఆంజనేయులు

కులకచర్ల, మార్చి 13 : కులకచర్ల మార్కెట్‌ను రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ ఆంజనేయులు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన మార్కెట్ కమిటీ సర్వసభ్యసమావేశంలో ఆయన మాట్లాడుతూ కులకచర్ల మార్కెట్‌ను రైతులకు అనుకూలంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వ్యాపారస్తులు తప్పని సరిగా లైసెన్సులు పొందాలని సూచించారు, ఈ సందర్భంగా మార్కెట్ అభివృద్ధి కోసం వివిధ రకాలుగా ప్రణాళికలు తయారు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామ్మోహన్‌శర్మ, మార్కెట్ కమిటీ కార్యదర్శి విజయ్‌కిశోర్, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



నవాబుపేట, మార్చి13: పులుమామిడి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం అంగరంగా వైభంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తహసీల్దార్ జయరాం, ఎంపీడీవో అనురాధ హాజరయ్యారు. చిన్నారుల ఆటపాటలు, డ్యాన్సులు పలువురినీ ఆకట్టుకున్నాయి. దాదాపు 70 సంవత్సరాలు గల పాఠశాల చరిత్రను ఇక్కడ చదివి ప్రయోజకులైన వారి పేర్లను చదివి వినిపించారు. పాఠశాలకు ఎకరం పైగా స్థలాన్ని దానం చేసిన రాజయ్యకు, వార్షికోత్సవ కార్యక్రమానికి అన్నదానం చేసిన రత్నమొళ్ల రవీందర్‌రెడ్డికి సభావేదిక ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమంలో ఆర్ఐ రాజు, సెక్రటరీ నితిన్, ఉపాధ్యాయులు మల్లేశం, విజయ్‌కుమార్, గోపాల్, వెంకటేశం, అంగన్‌వాడీలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులుగా...




పూడూరు, మార్చి 13: పూడూరు మండలం కడ్మూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గురువారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. విద్యార్థులు తోటి విద్యార్థులకు బోధించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మధు మాట్లాడుతూ దేశ భవిష్యత్తు నేటి బాలబాలికలపై ఆధారపడి ఉందన్నారు. విద్యార్థులు కలలు కనడమే కాదు వాటిని నెరవేర్చుకునేందుకు నిరంతరం శ్రమించాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపా ధ్యాయులు శ్రీకాంత్, విఠల్, అనూష, హరీశ్‌బాబు, జె.మల్లేశ్, మొగ్రి సువానయ్య, ఎం. యాదయ్య, తిరుమలేశం, కృష్ణ, మానీల, శ్రీలత, సురేశ్,రమేశ్,కుమారస్వామి పాల్గొన్నారు.

## శిక్షణాఫౌండేషన్ ఆధ్వర్యంలో క్విజ్‌పోటీలు



కులకచర్ల, మార్చి 13 : మండల పరిధిలోని పుట్టపహాడ్ ఉన్నత పాఠశాలలో గురువారం శిక్షణా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. పుట్టపహాడ్ కాంప్లెక్స్ పరిధిలోని విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఎంపీపీఎస్ అనంతసాగర్ పాఠశాల ప్రథమ బహుమతి పొందింది. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అజ్మతుల్ల, శిక్షణా పౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



మర్పల్లి, మార్చి 13: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని మోమిన్‌పేట్ సీఐ వెంకట్ గురువారం పరిశీలించారు. కేంద్రంలోని వసతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.. ఆయన వెంట ఎస్సై సురేశ్, సిబ్బంది ఉన్నారు.

## వంద శాతం పన్ను వసూళ్లు చేయాలి

తాండూరు రూరల్, మార్చి 13: మార్చి నెలాఖరునాటికీ పంచాయతీ కార్యదర్శులు వంద శాతం పన్ను వసూలు చేయాలని తాండూరు డివిజన్ డీఎల్‌పీవో రతన్‌సింగ్ అన్నారు. బుధవారం తాండూరు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తాండూరు, పెద్దేముల్, యాలాల, బషీరాబాద్, కొడంగల్, దుద్యాల, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాల పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయికి వెళ్లి వంద శాతం పన్ను వసూళ్లు చేపట్టాలన్నారు. ఎల్ఆర్ఎస్ మార్చినెలాఖరు వరకు క్రమ బద్దీకరించుకోవాలని సూచించారు. 25 శాతం రాయితీతో ప్రభుత్వం అవకాశం కల్పించిందని డీఎల్‌పీవో రతన్‌సింగ్ తెలిపారు.

## మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య

దోమ, మార్చి 13 : మతిస్థిమితం సరిగా లేని ఓ వ్యక్తి తన పొలం దగ్గర ఉన్న షెడ్డులో ఉరివేసుకున్న ఘటన దోమ పోలీసు స్టేషన్ పరిధిలోని కిష్టాపూర్ గ్రామంలో గురువారం చోటుచేసుకున్నది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కిష్టాపూర్ గ్రామానికి చెందిన నాందర్‌పేట్ లక్ష్మయ్య(55)కు కొన్ని సంవత్సరాల క్రితం నుంచి మతిస్థిమితం సరిగా లేదని ఇదే క్రమంలో ఆయన తన పొలం దగ్గర ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి భార్య మౌలాలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు దోమ పోలీసులు తెలిపారు.

## ముందస్తు హోలీ సంబురాలు..



బంట్వారం: కుంచావరంలో హోలీ సంబురాల్లో చిన్నారులు



కులకచర్ల మండలం చెల్లాపూర్ పాఠశాలలో..

బంట్వారం/కులకచర్ల మార్చి13: బంట్వారం మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు రంగులు చల్లుకొని హోలీ సంబురాలు చేసుకున్నారు. కులకచర్ల మండల పరిధిలోని చెల్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు హో లీసంబురాలను గురువారం ఘనంగా నిర్వహించారు. హోలీ పండుగకు ఒక రోజు ముందుగానే విద్యార్థులు ఒకరిపై ఒకరు రంగుల వేసుకుంటూ హోలీ సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తుప్పలి ఆనంద్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం..



బొంరాస్‌పేట్, మార్చి 13: మండల పరిధిలోని వడిచర్ల గ్రామంలో నూతన సీసీ రోడ్డు పనులకు భూమి పూజ నిర్వహించారు. రూ. 10లక్షల నిధులతో ఈ రోడ్డును నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింహులు గౌడ్, వెంకట్ రాములు గౌడ్, మల్లేశ్, రాంరెడ్డి, కృష్ణయ్య, గోపాల్ రెడ్డి, రాములు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.




ధారూరు, మార్చి 13: మండల పరిధిలోని మోమిన్‌కలాన్‌లో ఎంపీ నిధులు రూ.10లక్షలతో గ్రామంలో సీసీ రోడ్ల పనులను గురువారం నాయకులు ప్రారంభించారు కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు రాజుగుప్తా, మాణిక్యం ఉన్నారు.




మర్పల్లి, మార్చి 13 : మండల కేంద్రంలోని మార్కెట్ నుంచి కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులు గురువారం ప్రారంభించినట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్ తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రాములు యాదవ్, సురేశ్ యాదవ్, రవీందర్ సాగర్, సలీం, రాచన్న, సర్వేశ్, ఫసియోద్దీన్ పాల్గొన్నారు.

## బదిలీ అయిన పంచాయతీ కార్యదర్శులకు సన్మానం



తాండూరు రూరల్, మార్చి 13 : తాండూరు మండలం నుంచి బదిలీ అయిన పంచాయతీ కార్యదర్శులకు బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. పంచాయతీ కార్యదర్శి లాలప్ప, రసీద్‌లను ఎంపీడీవో విశ్వప్రసాద్, ఎంపీవో సుశీల్‌కుమార్‌తోపాటు పలువురు పంచాయతీ కార్యదర్శులు సన్మానించారు.

## బదిలీ అయిన టీచర్‌కు ఘనంగా వీడ్కోలు..



బొంరాస్‌పేట్, మార్చి 13: మండల పరిధిలోని నాగిరెడ్డి పల్లి ప్రాథమిక పాఠశాలలో బదిలీపై ఇతర పాఠశాలకు వెళ్లిన భూదేవి టీచరుకు పాఠశాలలో ఘనంగా వీడ్కోలు పలికారు. పూల మాలలు, శాలువాలతో పీఆర్‌టీయూ, తపస్, యూటీఎఫ్ సంఘం నాయకులు ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బాకారం మల్లయ్య, శ్రీప్రియ, బాకారం చంద్రశేఖర్, అనిల్‌కుమార్, పాఠశాల హెచ్ఎం లావణ్య, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్నేహం..ప్రేమ.. పెండ్లి పేరుతో మోసాలు

• షీ టీమ్స్‌ను ఆశ్రయిస్తున్న బాధితులు • నెల రోజుల్లో 187 మంది పోకిరీలు అరెస్ట్ • రాచకొండ సీపీ సుధీర్‌బాబు

సిటీబ్యూరో, మార్చి 13 (నమస్తే తెలంగాణ): తమతో పాటే పనిచేస్తుంటారు.. కొన్నాళ్లు స్నేహితులుగా ఉంటూ... ఆ తర్వాత నిన్ను ప్రేమిస్తున్నాను పెండ్లి చేసుకుంటానంటూ నమ్మిస్తారు. వారి మాటలు నమ్మి ఒకే చెబితే.. కొన్నాళ్లు కలిసి తిరిగి.. పెండ్లి ప్రస్తావన వచ్చేవరకు నీవెవరు.. అంటూ ముఖం చాటేస్తుంటారు.. ఇలాంటి వారిపై బాధితులు షీ టీమ్స్‌ను ఆశ్రయిస్తూ మోసం చేసిన వారికి బుద్ధి చెబుతున్నారు. రాచకొండ షీ టీమ్స్‌కు బాధిత మహిళలు ఫిర్యాదులు చేస్తుండడంతో కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తున్నారు. నెల రోజుల వ్యవధిలో రాచకొండ షీ టీమ్స్‌కు వచ్చిన ఫిర్యాదులు, రెడ్ హ్యాండెడ్‌గా 187 మంది పోకిరీలు పోలీసులకు దొరికిపోయారు. ఇందులో కేసుల తీవ్రతను బట్టి చర్యలు తీసుకున్నట్లు రాచకొండ ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ ఉషా విశ్వనాథ్ వెల్లడించారు. బాలికలను, మహిళలను వేధించే పోకిరీలను వదిలి పెట్టేది లేదని, మహిళలు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని షీ టీమ్స్ వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని రాచకొండ సీపీ సుధీర్‌బాబు ప్రజలకు సూచిస్తున్నారు. కమిషనర్ ఆదేశాలతో షీ టీమ్స్ ప్రతి రోజు బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, స్కూళ్లు, కాలేజీలు, కూరగాయల మార్కెట్లు, బహిరంగ ప్రదేశాలలో మఫ్టీలో తిరుగుతూ డెకాయి ఆపరేషన్లు చేస్తున్నాయి. ఇలా చేయడంతో గత నెలలో పట్టుబడ్డ 187 మంది పోకిరీలలో 122 మంది మేజర్లు, 65 మంది మైనర్లు ఉన్నారు. వీరికి ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంప్ ఆఫీస్ ప్రాంగణలోని ఉమెన్ సేఫ్టీవింగ్ ఆఫీసులో కౌన్సిలింగ్ నిర్వహించారు. గత నెలలో షీ టీమ్స్‌కు 241 ఫిర్యాదులు అందాయని, మహిళలు ధైర్యంగా ఫిర్యాదు చేస్తున్నారని డీసీపీ వెల్లడించారు.

## ఆస్తికోసం తల్లిని చంపిన కొడుకు

### శంషాబాద్ మున్సిపాలిటీ రాళ్లగూడలో ఘటన

శంషాబాద్ రూరల్, మార్చి 13 ఆస్తికోసం తల్లిని కొడుకు చంపేసిన సంఘటన బుధవారం అర్ధరాత్రి శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు రాళ్లగూడ రాఘవేంద్రకాలనీలో నివాసముంటున్న రాచమల్ల చంద్రకళ(55) ఇద్దరు కుమారులతో కలిసి జీవనం సాగిస్తుంది. పెద్దకొడుకు రాచమల్ల ప్రకాశ్(38)కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. గతకొంత కాలం నుంచి రాఘవేంద్రకాలనీలో ఉన్న 100 గజాల ఇంటిని ఇద్దరు అన్నదమ్ములకు పంచి ఇవ్వాలని ప్రకాశ్ తల్లిని తరచూ వేధింపులకు గురి చేస్తున్నాడు. బుధవారం రాత్రి మద్యం మత్తులో తల్లితో గొడవపడి ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్‌ను తలపై వేయడం, కట్టెలతో తలపై బాదడంతో తీవ్ర గాయాలైన ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. ప్రకాశ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

## అడవిపందిని తప్పించబోయి వ్యక్తి మృతి

యాలాల, మార్చి13: అడవిపందిని తప్పించబోయి ద్విచక్ర వాహనంపై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని రాఘవాపూర్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే... బొంరాస్‌పేట్ మండలం మెట్లకుంట గ్రామానికి చెందిన కావలి సుధాకర్(33) మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో బుధవారం తాండూరు పట్టణానికి వచ్చి పని ముగించుకొని వెళ్లే సమయంలో రాఘవాపూర్ గ్రామ సమీపంలోకి రాగానే అడవిపంది అడ్డురాగా తప్పించబోయి కింద పడగా తలకు తీవ్ర గాయాలై ప్రమాద స్థలంలోనే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు . మృతుడి భార్య అనిత పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గిరి తెలిపారు.

## దర్శకుడిపై దాడి.. కేసు నమోదు

బంజారాహిల్స్, మార్చి13: కొడంగల్ ప్రాంతానికి చెందిన మిర్జాపురం అశోక్ తేజ(28) అనే యువకుడు జూబ్లీహిల్స్ రోడ్ నెం 5లో నివాసం ఉంటూ దర్శకుడిగా పనిచేస్తున్నాడు. మాదాపూర్‌లో యాడ్ షూటింగ్ గురించి చర్చించేందుకు వెళ్లి బుధవారం తెల్లవారు జామున తన బైక్ మీద ఇంటికి బయలుదేరాడు. జూబ్లీహిల్స్ రోడ్ నెం 10లోని డైమండ్ హౌజ్ సమీపంలోకి రాగానే రెండు బైక్‌లపై అతివేగంతో నలుగురు యువకులు దూసుకువచ్చారు. ఎందుకు అంత వేగంతో డ్రైవింగ్ చేస్తారంటూ అశోక్ తేజ వారిని ప్రశ్నించాడు. దీంతో మాటామాటా పెరగడంతో వారిలో ఓ వ్యక్తి కర్రతో అశోక్‌తేజ తలపై కొట్టడంతో గాయపడ్డాడు. బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## 16న మహిళల కోసం జాబ్ మేళా

సిటీబ్యూరో, మార్చి 13 (నమస్తే తెలంగాణ): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాచకొండ పోలీసులు మహిళల కోసం ప్రత్యేకంగా మెగా జాబ్ మేళాను ఈ నెల 16న నిర్వహిస్తున్నట్లు రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు వెల్లడించారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్, రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో నాగోల్‌లోని ఎస్‌వీఎం గ్రాండ్‌లో నిర్వహించే ఈ జాబ్ మేళాలో50కిపై కంపెనీలు పాల్గొంటాయని,పాల్గొనే వారు https://lu.ma/22ladcu2 తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.